నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ కూలికి పాముకాటు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రఘు అనే ఉపాధి హామీ కూలీ గురువారం ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనిచేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, గోపికష్ణ, ఆశమల్ల సాయిబాబా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితునికి మనోధైర్యమిచ్చారు. మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ఆసుపత్రికి తరలించడానికి మదన్ మోహన్ రావు ట్రస్ట్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు.


కూలీని ఆసుపత్రికి తరలిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సొసైటీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండలంలోని పెద్దమల్లారెడ్డి సొసైటీ పరిధిలో గల కంచర్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఎక్కడ కూడా ధాన్యం రోడ్డుపై ఉండవద్దని కొనుగోలను వేగవంతం చేయాలని సూచించారు. సొసైటీ పరిధిలో 8000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 4000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని సొసైటీ కార్యదర్శి మోహన్ గౌడ్ అదనపు కలెక్టర్‌కు తెలియజేశారు. వారం రోజులలో ధాన్యం కొనుగోలు పూర్తవుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్‌తో పాటు డిఎం సత్యానందం, డీఎస్ఓ మల్లికార్జున్, సివిల్ సప్లై డ్యూటీ కిష్టయ్య, రైతులు, తదితరులున్నారు.



గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని ఖిల్లా చౌరస్తాలో గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ వి.సోమి రెడ్డి సూచనల మేరకు కే.మల్లా రెడ్డి ఆదేశాలకు మేరకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ఓ టీం ఖిల్లా చౌరస్తాలో గురువారం తనిఖీలు నిర్వహించగా (1.220) కేజీల గంజాయి దొరికింది. ఈ దాడుల్లో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సదుల్ల ఖాన్ అనే వ్యక్తిగా గుర్తించారు. మరో వ్యక్తి పరారీ అయ్యాడు. అతని గురించి విచారించగా.. ఎండి యూనస్ అలియాస్ రిజ్వాన్ దగ్గర నుంచి గంజాయిని తీసుకొని అమ్ముతున్నట్టు సదుల్ల ఖాన్ చెప్పారు. పోలీసులు వీరిద్దరిపై కేసు నమోదు చేసి సాదుల్ల ఖాన్‌ను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు. పరారీలో ఉన్న యునుస్‌ను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌హెచ్ఓ బి.దిలీప్ తెలిపారు. సదుల్లా ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐలు సుష్మిత, సింధు, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, సంగయ్య, దారిసింగ్, సంజయ్ పాల్గొన్నారు.


గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దార్ తెలిపారు.



వేతనాల్లేవ్..



- నెలల తరబడి జీపీ కార్మికుల జీతం పెండింగ్
- కుటుంబ పోషణ భారమవుతోందని ఆవేదన
- సబ్బులు, గ్లౌజ్‌లూ ఇవ్వని వైనం

నవతెలంగాణ-బోధన్

కోడి కూయకముందే విధి నిర్వహణలో నిమగ్నమవుతారు పారిశుధ్య కార్మికులు. గ్రామంలో ఎక్కడ చెత్తాచెదారమున్నా.. అద్దంలో కనిపించేలా శుభ్రపరుస్తారు. కాలనీలలో మురికి కాలువలను శుభ్రం చేసి ఎలాంటి దుర్వాసన రాకుండా వారి బతుకులను దుర్భరం చేసుకుంటూ జనాలకు సేవలందిస్తారు. అంతటి నిబద్ధతతో పనిచేసే కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందకపోవడంతో అల్లాడుతున్నారు. ఒళ్లంతా హూనం చేసుకొని చాలీచాలని వేతనంతో మురికి కూపంలో దిగి మురికి కాలువల శుభ్రం చేస్తున్నా.. వారిని పట్టించుకునే నాథుడే లేడు. అనారోగ్యంతో ఏ ఒక్కరోజు విధులకు గైరాజరైనా పంచాయతీ అధికారులు, నాయకుల ద్వారా ఈసడింపులు, చీదరింపులు, అవమానాలే వారికి దిక్కవుతున్నాయి.

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని 530 గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. 500 మంది జనాభాకు ఒకరి చొప్పున మల్టీపర్పస్ విధానంలో కార్మికుల నియామకాన్ని చేపట్టారు. దాంతో చిన్న గ్రామ పంచాయతీలలో ముగ్గురు, నలుగురు ఉంటే.. మేజర్ గ్రామ పంచాయతీలలో పదిమంది వరకు పారిశుధ్య కార్మికులు పనులు చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. వారికి గ్రామపంచాయతీ పాలకులు నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్ వేతనాలు ఇలా..

కోటగిరి మండలంలోని హంగర్గా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత 6 నుంచి 8 నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రెంజల్ మండలంలోని నీలా, రెంజల్ గ్రామంలో కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు కుటుంబాలు గడవక మదన పడుతున్నారు. బోధన్ మండలంలో రెండు నెలల నుంచి పలుచోట్ల వేతనాలు అందడం లేదని కార్మికుల పేర్కొంటున్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న సాలూరా మండలంలో సరిపడా పారిశుధ్య సిబ్బంది లేక గ్రామంలో మురికి కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పై నాలుగు మండలాల్లోనే కాక.. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు సరైన సమయంలో వేతనాలు అందడం లేదు.

కార్మికులకు అందని వస్తువులు..

గ్రామపంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం నెలనెలా నూనెలు, సబ్బులు, గ్లౌజులు, చెప్పులు అందించవలసి ఉంటుంది. కానీ అవి కూడా సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో పారిశుధ్య కార్మికులు మురుగుతో అనారోగ్యం బారిన పడుతున్నారు. అసలే నిరుపేద కుటుంబాలు కావడం.. వేతనం సరిగా రాకపోవడంతో జ్వరాలతోనే విధులకు హాజరై పనులు చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం ఒక్కో పారిశుధ్య కార్మికులకు గతంలో రూ.8500 చొప్పున వేతనాలు చెల్లించింది. మధ్యలో మరో రూ.వెయ్యి పెంచడంతో ప్రస్తుతం రూ.9500 వేతనం అందిస్తున్నారు. ఈ వేతనం కూడా సరైన సమయంలో చెల్లించకపోవడతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పిల్లల చదువులకు, రోజువారి కుటుంబ నిర్వహణకు డబ్బులు లేక అప్పులు చేయవలసిన దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ కార్మికుల విధులు..

మల్టీపర్పస్ విధానంలో నియమించిన పారిశుధ్య కార్మికులు వీధిలైట్లు వేయడం, పారిశుధ్యం పనులు, మురుగు కాలువలు, పూడిక తొలగింపు, చెత్తట్రాక్టర్ నడపడం, మంచినీటి సరఫరా పనులు చేయవలసి ఉంటుంది. వీరు మాత్రం గ్రామాలలో పారిశుధ్య పనులకు హాజరుకాకుంటే ఆరోజు గ్రామం మురికితో, చెత్తాచెదారంతో దుర్గంధంగా మారుతుంది. కాలనీలలో చెత్త సేకరణకు ట్రాక్టర్ ద్వారా ప్రతిరోజు వెళ్తారు. ఏ ఒక్కరోజు వెళ్లకున్న ఇండ్లలో చెత్త ముగుగుతుంది. ఇంతటి కష్టమైన పనులు చేస్తున్నా.. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడం శోచనీయమని కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే వీరి బకాయి వేతనాలను మంజూరు చేసి ఆదుకోవాలని కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

8 నెలలుగా జీతం లేదు



నేను హంగర్గ జీపీలో విధులు నిర్వహిస్తాను. ఇప్పటివరకు గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా వేతనం రాకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. జీతాలు అడిగితే గ్రామ పంచాయతీలో నిధులు లేవని నిధులు రాగానే జీతాలు ఇస్తామని గ్రామ పంచాయతీ పెద్దలు అంటున్నారు. దాంతో ఏం చేయాలో తెలవక అలాగే పనులు చేస్తున్నాం. జీతాలు ఎప్పుడు వస్తాయోనని ఆశతో ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో పిల్లలకు, రోజువారి కుటుంబ నిర్వాహనకు అప్పులు చేయవలసి వస్తుంది.

– హనుమండ్లు, హంగర్గఫారం

ఏం తిని బతకాలి..?

జీతాలు రాకున్నా మూడు నెలల నుంచి అలాగే నెట్టుకొస్తున్నాం. పైసలు అవసరమైనప్పుడల్లా బయట చేబదులు తీసుకొని, కొన్నిసార్లు వడ్డీకి అప్పులు తీసుకొని కుటుంబాలను నడుపుతున్నాం. ఈ గవర్నమెంట్ గ్రామపంచాయతీలకు డబ్బులు ఇవ్వలేదని మాకు జీతాలు ఇయ్యక సతాయిస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి మాకు జీతం ఇవ్వాలి. జీతాలు ఇయ్యకుంటే మేం ఏంతిని బతకాలా సార్.

– లలిత, నీలా జీపీ

వేతనాలను వెంటనే చెల్లించండి



గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సిబ్బంది బకాయి వేతనాలను ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలి. లేనియెడల గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులతో ఉద్యమిస్తాం. నిజామాబాద్ జిల్లాలో గత ఎనిమిది నెలల నుంచి 6 నెలల నుంచి వేతనాలు చెల్లించలేదు. బకాయి వేతనాలు అడిగితే పని మానేయాలని కార్మికులను దబాయించడం లాంటివి సరికాదు. జీతాలు లేకుండా సిబ్బంది ఎలా పని చేస్తారో అధికారులు చెప్పాలి. ఇప్పటికే 8 నెలలు, ఆరు నెలల బకాయిలు ఉన్నప్పటికీ అప్పులు తెచ్చుకొని జీవనం వెళ్లదీస్తున్నారు. ఇలా అయితే కార్మికులు ఎలా బతకాలో అధికారులే చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి జీతాలను మంజూరు చేయాలి.

– సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

ఉత్తుత్తి క్రీడా ప్రాంగణాలు

- బోర్డులే దర్శనం
- ఉపయోగంలో లేని వైనం

నవతెలంగాణ-నిజాంసాగర్

పట్టణాల్లో మాదిరిగా గ్రామాల్లోనూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పనికి రాకుండాపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హడావుడిగా నిర్మించిన ఈ ప్రాంగణాల అసలు లక్ష్యం విస్మరణకు గురవుతోంది. ప్రతి ఊరిలో క్రీడా ప్రాంగణం అనే బోర్డులు కనిపిస్తున్నా.. అందులో ఆడుకునేందుకు ఆటపరికరాలు మాత్రం కనిపించడం లేదు. ఉపాధి హామీ నిధులు రూపాయలు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణాలతో గ్రామీణులకు ఎలాంటి ఉపయోగం కలగడం లేదు. మరోపక్క కొన్నిచోట్ల ఈ ఆటస్థలాల ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో పాఠశాలల, గ్రామపంచాయతీల, డంపింగ్‌యార్డుల వద్ద బోర్డులు పెట్టి మమా అనిపించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టిన అధికారులు కాగితాల్లో కనిపించగానే ఈ ప్రాంగణాలను బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి ఉపయోగంలోకి తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పట్టణాల్లో మాదిరి గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఉపాధి హామీ నిధులు గ్రామ సమీపంలోని కనీసం అర ఎకరం ఖాళీ స్థలంలో వీటిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు కోకో, వాలీబాల్, బాస్కెట్ బాల్, షటిల్, కబడ్డీ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా ఆట పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించింది. ప్రతి పంచాయతీలో వీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పడంతో అప్పటి అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులకు ఒత్తిడితో అప్పటి సర్పంచులు, స్థానిక గుత్తేదారులకు వీటిని ఏర్పాటు చేసే బాధ్యతను అప్పగించింది. ఒక్క ప్రాంగణం ఏర్పాటుకు రూపాయలు లక్ష నుంచి రెండున్నర లక్షల వరకు వెచ్చించినట్లు తెలిసింది. కానీ అనేకచోట్ల ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా మాజీ సర్పంచులు వీటిని ఏర్పాటు చేసేందుకు నాన ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అప్పటి ప్రభుత్వం, అధికారులు ప్రతినెల సమీక్షించడం.. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయడం మూలంగా బడులు, పంచాయతీ కార్యాలయాలతో పాటు గ్రామంలో ఎక్కడ కొంత ఖాళీ స్థలం కనిపించినా.. అక్కడ బోర్డులు పెట్టేసి అధికారులకు నివేదించారు. ఈ ప్రాంగణాలకు ఎక్కడ ఫెన్సింగ్ వేసిన దాఖలాలు లేవు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే వీటికి బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దానితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పరికరాల కోసం వెచ్చించిన లక్షల రూపాయల నిధులు దుబారా అయినట్లు కనిపిస్తోంది. ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించడంతో మండలంలో 27 గ్రామపంచాయతీలో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంగణం కోసం సుమారు 2.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. అనేక చోట్ల కేవలం క్రీడా ప్రాంగణం అనే పేరుతో బోర్డుపై రాయించి ఎక్కడో ఒకచోట ఆ బోర్డుని పెట్టారు. కొన్ని ఊరికి దూరంగా ఉండడం మరికొన్నిచోట్ల బడుల బోర్డుల పక్కన వీటిని ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో వీటి ఏర్పాటుపై పర్యవేక్షణ చేసి బిల్లులు చెల్లించాల్సి ఉండగా అధికారులు మామూలుగా తీసుకుంటూ అవేమీ పట్టించుకోనట్లు తెలిసింది. వారి పర్యవేక్షణ లేని మూలంగా క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలో లేకపోగా.. మండలం మొత్తం లక్షల నిధులు దుబారా చేసినట్లు కనిపిస్తోంది. వీటి ఏర్పాటులో అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం, ఉన్నత అధికారులు దృష్టి సారించి వీటిని బాగు చేయించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.



క్రీడా ప్రాంగణానికి ఏర్పాటు చేసిన బోర్డు

కుస్తీమే సవాల్

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం చివరి రోజు కుస్తీ పోటీలను ఆలయ కమిటీ సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో నిర్వహించారు. ఈ కుస్తీపోటీలకు మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మలయోధులు తరలివచ్చారు. రూ.200 నుంచి 500 వరకు మల్లయోధులు కుస్తీ పోటీలోల పాల్గొన్నారు. ఈ పోటీలను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు.


కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

పోచారం సవాల్ ఏమైంది..?

- 'డబుల్' బిల్లులు రాకుంటే నిరాహార దీక్ష చేస్తానని వెల్లడి
- బాన్సువాడ ఎమ్మెల్యే ప్రకటన కోసం చూస్తున్న లబ్దిదారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలకు చెందిన బిల్లులు చెల్లించేందుకు బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అడ్డువస్తున్నారని, మే నెల 14వ తేదీ వరకు బిల్లులు చెల్లించలేని పక్షంలో లబ్దిదారులతో కలిసి కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి లోకసభ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో సవాల్ చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో నిర్మించనన్ని బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల ఇండ్లు నిర్మించామని, రూ.400 కోట్ల నిధులు విడుదల అయ్యాయని, ఇంకా రావలసిన రూ.13 కోట్ల నిధులు విడుదల కాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డు తగులుతున్నారని, దీనిపై తాను కలెక్టరేట్ కార్యాలయం ముందు మే 15వ తేదీన రెండు పడకల గదుల లబ్దిదారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, అవసరమైతే బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు ప్రాణ త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

ఈనెల 15 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ప్రసంగించిన మాజీ స్పీకర్ మే 15వ తేదీ గడిచిపోయి 24వ తేదీకి చేరుకున్నప్పటికీ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిరాహార దీక్షపై ఎలాంటి ప్రకటన చేయలేదని బాన్సువాడ నియోజకవర్గంలో రెండు పడక గదులు ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే ప్రకటన కోసం లబ్దిదారులు ఎదురుచూస్తు న్నారు. ఇల్లు నిర్మాణానికి అయ్యే ఖర్చు భారమైనా.. సొంత ఇల్లు సమకూర్చుకోవాలన్న ఆరాటంతో ప్రైవేట్ అప్పులు చేసి ఇండ్లు నిర్మించుకోగా చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక లబ్దిదారులు నానా అవస్థలు పడుతున్నారు. రాజకీయాలకు తావులేకుండా పార్టీలకు అతీతంగా నిర్మించుకున్న రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం బిల్లులు వచ్చేలా అధికార, ప్రతిపక్ష నాయకులు కృషి చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం తమ దుస్థితిని గుర్తించి, స్పందించాలని, వెంటనే బిల్లులు విడుదల చేయించాలని కోరుతున్నారు.


లోకసభ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం (ఫైల్)

ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా

- ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తానని, ఆలయంలో ఉన్న సమస్యలు పరిష్కరించి అభివద్ధి చేస్తానని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ హామీనిచ్చారు. గురువారం సిద్ధ రామేశ్వర ఆలయంలో భిక్కనూర్ పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాస్తు హెూమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాస్తు హెూమా పూజా కార్యక్రమాలు చేపడుతున్న ఉడిపి పూజారులు వాస్తు నివారణ, ఆలయ అభివద్ధి పనుల గురించి షబ్బీర్ అలీకి వివరించారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఆలయ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సిద్దరామేశ్వర ఆలయాన్ని అభివద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అంతకుముందు హోమం కార్యక్రమానికి విచ్చేస్తున్న షబ్బీర్ అలీకి హైకోర్టు న్యాయవాది రామ్‌రెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింబాద్రి, నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాపురెడ్డి, అఖిలపక్ష నాయకులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


షబ్బీర్ అలీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవ తెలంగాణ
నిజామాబాద్
2
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

దొంగతనాలను అరికట్టాలని వినతి



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పంట పొలాల్లోని మోటార్ల విద్యుత్ తీగలను ఎత్తుకెళ్తున్న దొంగలను పట్టుకోవాలని కోరుతూ మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం ఎస్ఐ రాజశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని వరద కాలువ కెనాల్‌కు ఆనుకొని సుమారు 50మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి జీవన ఉపాధి పొందుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇటీవల తరచూ అర్ధరాత్రి విద్యుత్ తీగలను, వ్యవసాయ పనిముట్లను, డ్రిప్ పైపులను ఎత్తుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్న దొంగలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని రైతులువిన్నవించారు.

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం-మీడియా సెమినార్ కు విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జోరుగా మాధవనగర్ బ్రిడ్జి పనులు



ట్రక్‌పై తెచ్చిన బ్రిడ్జి వాలు

నవతెలంగాణ-నిజామాబాద్

మాధవ నగర్ బ్రిడ్జి పనుల్లో వేగం పెరిగింది. గురువారం ఒక ట్రక్ పై బ్రిడ్జికి సంబంధించిన వాలును తీసుకురావడంతో ట్రక్కు పొడవు చూసి సాయిబాబా దర్శనానికి వచ్చిన భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 15 రోజుల నుండి అక్కడ జరుగుతున్న బ్రిడ్జి పనులలో వేగం పెరిగింది. చాలా మట్టుకు అనుకున్న గడువులోగా బ్రిడ్జి పనులు పూర్తవుతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామ సమస్యలపై అధికారులకు వినతి



గ్రామ సమస్యలను వివరిస్తున్న వీడీసి సభ్యులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం మండల పరిషత్, ఇరిగేషన్ అధికారులను కోరారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామంలో పంట కాలువలు తీయడం, పలుచోట్ల ఇంకుడు గుంతల నిర్మాణం, గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో గ్రామ చుట్టుపక్కల ప్లానిటేషన్ ద్వారా పండ్ల చెట్లను నాటాలని ఏపీవో ఇందిరను కోరారు. అలాగే గ్రామంలోని చెరువు భూమి కబ్జాకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని, చెరువు దగ్గర తుంగ పెరగడంతో వాటిపై డ్రోన్‌తో గడ్డి మందు చల్లాలని ఇరిగేషన్ అధికారులు ఈఈ భాను ప్రకాష్, డిఈ సురేష్‌ను వారు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సల్ల నర్సయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిప్పర అశోక్, ఉపాధ్యక్షుడు గంగాధర్, కోశాధికారి చింతలూరు గంగాధర్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పను పరిశీలించిన పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ



పల్లె ప్రగతిని పనులు పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తూంపల్లి గ్రామపంచాయతీ లోని పల్లె ప్రగతిలో చేపట్టిన పనులను పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ గురువారం పరిశీలించారు. తూంపల్లి గ్రామంలోని వైకుంఠధామం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ వద్ద తడి చెత్త, పొడి చెత్త ప్రజల నుండి వేరు వేరు చేసి, డంపు యార్డ్ వద్ద తడి చెత్తతో ఎరువు తయారయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. తయారైన ఎరువులు స్థానికంగా పెంపకం చేసే మొక్కలకు వినియోగించేలా ఆదేశించారు. అదనంగా ఉన్నప్పుడు చెత్త ఇతర సామగ్రిని విక్రయించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సందడి చేసిన రోషం బాలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ప్రవేద ఇండియా కంపెనీ బ్రాంచెస్‌ను సినీ హీరో జైతెలంగాణ ఫేమ్ "రోషం బాలు" గురువారం పట్టణంలో సందడి చేశారు. ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ఎంత అవసరమో తెలియజేశారు. ఈ కంపెనీలో నిరుద్యోగ యువతీ యువకులకు, అందరికీ ఆరోగ్యం, డబ్బు సంపాదన కావాల్సిన విధివిధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్చార్జి రామకృష్ణ రాజు, లక్పతి, రాకేష్, శంకర్ అభిషేక్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

దాడులు జరుగుతున్నా...
ఆగని గంజాయి దందా

- నిత్యం పట్టుబడుతున్న వైనం
- ఒరిస్సా నుంచి దిగుమతి

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాలో గంజాయి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తున్న నిత్యం ఎక్కడ ఒకచోట పట్టుబడుతూనే ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామ శివారులో పోలీసులు 9 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి 268 గ్రాముల ఎండు గంజాయి, స్కార్పియో వాహనం, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. ఇలా ఒక్కటే కాదు.... నిత్యం ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నవి.

యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయి..

జిల్లాల్లో గంజాయి మత్తు పదార్థాల వినియోగం ఆగడం లేదు. పోలీసులు నజర్ పెట్టి కేసులు నమోదు చేస్తున్న వివిధ మార్గాలలో సరఫరా చేస్తున్నారు. అవసరమైన వారికి ప్రత్యేకమైన మార్గాల్లో మత్తు పదార్థాలను చేరవేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గంజాయి యువతను పెడదోవ పట్టిస్తోంది.. జిల్లాల్లో గ్రామ గ్రామాన గంజాయి అడ్డాలు వెలిశాయి. గ్రామాల్లో చాక్లెట్లు దొరుకుతాయో.. లేదో కానీ గంజాయి చాక్లెట్ మాత్రం ఈజీగా దొరుకుతుంది. గంజాయి అక్రమ రవాణాకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టిన ఫలితం ఉండడం లేదు. గంజాయి అక్రమ రవాణా దారులు అధికారుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ దర్జాగా తమ దందాను కొనసాగిస్తున్నారు. పలుమార్లు పట్టుబడిన ఈజీ మనకి అలవాటు పడిన గంజాయి అక్రమ రవాణా దారులు దందాను చేస్తున్నారు. వివిధ రూపాల్లో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. చాక్లెట్ల రూపంలో పొగాకు రూపంలో, ఎండు గంజాయి, పచ్చి గంజాయి తాజాగా గంజాయిని నూనె రూపంలో అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక రూపంలో అరికడదామంటే ఎక్సైజ్ అధికారులకు వ్యాపారులు వివిధ రూపాల్లో గంజాయిని అమ్ముతూ వారికి ఛాలెంజ్ విసురుతున్నారు. గత జనవరి నెలలో జిల్లాలో గంజాయిని నూనె రూపంలో అమ్మకాలు జరగడం సంచలనం రేపింది. జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోకి రాకుండా అరికట్టాలని ఉద్దేశంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చెక్ పోస్ట్‌లో సిబ్బందిని సైతం పెంచారు. ముఖ్యంగా రైళ్ల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించిన ఎక్సైజ్ అధికారులు రైళ్లలో అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెట్టారు.



గంజాయిని సరఫరా చేసిన వ్యక్తితో పోలీసులు (ఫైల్)

ఒరిస్సా టు నాందేడ్ టు నిజామాబాద్...

జిల్లాలో గంజాయిని ఒరిస్సా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఒరిస్సా నుంచి నేరుగా కాకుండా ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ నుంచి రైలు ద్వారా నాందేడ్‌కు తీసుకొచ్చి నాందేడ్ నుంచి నిజామాబాద్ కు చేరవేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు గుర్తించి టాస్క్ ఫోర్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అడ్డుకొని ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికీ పలుచోట్ల రైళ్లలో తనిఖీలు చేసి గంజాయిని రవాణా చేస్తున్న వారిని పట్టుకున్నారు. ధర్మాబాద్ వరకు వెళ్లి అక్కడి నుంచి నిజామాబాద్ వరకు రైళ్లలో తనిఖీలు నిర్వహించి నిజామాబాదుకు గంజాయిని తరలించకుండా అడ్డుకుంటున్నారు..

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు...



నేడు యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు.. క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలి..

విద్యా గోపి కృష్ణ పట్వారి,
రోటరీ క్లబ్ అధ్యక్షులు,
ఆర్మూర్..

జిల్లాలోని బార్డర్ చెక్ పోస్టుల్లో..

జిల్లాలోని బార్డర్ చెక్‌పోస్టులు సాలూర, యాంచ తదితర చెక్‌పోస్టుల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉన్న సిబ్బందితోపాటు మరో ఇద్దరిని అదనంగా పెంచారు. గంజాయి అక్రమ రవాణాతోపాటు దేశీదారు, ఎన్‌డిపిఎల్ మద్యం కూడా ఈ చెక్‌పోస్టుల ద్వారా రవాణా జరుగుతుంది. వీటన్నిటిని అరికట్టేందుకు అదనపు సిబ్బందిని సైతం ఎక్సైజ్ అధికారులు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలోని చదువుకునే విద్యార్థులు సైతం గంజాయికి బానిస అవుతున్నారు. గంజాయిని అమ్మిన గంజాయికి అలవాటుపడ్డ వారిపైన ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ హెచ్చరించారు.

అనుమతులు లేని మైనింగ్‌ను అరికట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో కమ్మర్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో కొన్ని మైనింగ్ సంస్థలు సరియైన పర్యావరణ అనుమతులు లేకుండానే మైనింగ్ నిర్వహిస్తున్నాయని, గతంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ హెచ్చరించిన క్రమంలో గురువారం ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి. లక్ష్మణ్ ప్రసాద్‌ను కలిశారు. ఈసందర్భంగా వినియోగదారుల ప్రతినిధులు, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లె పాడు దామోదర్, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, స్థానిక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, సంయుక్త కార్యదర్శి మహదేవ్ శ్రీనివాస్ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ముందుగానే పర్యావరణ అనుమతులు తీసుకున్న తర్వాత నే, మైనింగ్ లైసెన్సు లు జారీ చేసే విధానం అమలు చేయాలని అన్నారు. మైనింగ్ సంస్థలతో కలిసి ప్రతీ మూడు నెలల కొకసారి "పర్యావరణ పరిరక్షణ సమావేశాలు" తప్పనిసరి గా ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల బట్టాపూర్‌లో అనుమతి లేని అతి పెద్ద అవినీతి మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ, పర్యావరణ శాఖ సమన్వయంతో నిజామాబాద్ జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లె పాడు దామోదర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార హక్కు చట్టం 2005 పరిధిలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి మైనింగ్ రికార్డు లను పరిశీలించారు.



వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు

సిపిఎం నాయకుడు అనంతరామశర్మ చిత్రపటానికి నివాళి



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు నల్గొండ జిల్లా కార్మిక సంఘం నాయకులు అనంత రామ శర్మ (90) బుధవారం రాత్రి మృతిచెందగా గురువారం నిజామాబాద్ జిల్లా నాయకులు నివాళ్లు అర్పించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్ రాములు పూలమాల లేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంతోపాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొని సిపిఎం పార్టీ ప్రజా సంఘాలైన రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు సిఐటియు ఉద్యమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందించారన్నారు. చివరి వరకు నిరాడంబర జీవితాన్ని గడిపారని నిరంతరం సమాజం మార్పు కోసం పరితపించారని తెలిపారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కమిటీ పక్షాన నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహన్ జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్ నగర నాయకులు మహేష్, గణేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మంచిప్పలో మహాలక్ష్మి, గజ్జలమ్మ జాతర

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత 44 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం బుద్ధ పూర్ణిమ మహాలక్ష్మి గజ్జలమ్మ వార్లకు జాతర నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా గురువారం బుద్ధపూర్ణిమ నిర్వహించారు. ఈ జాతర వల్ల ప్రజల మధ్య సమైక్యత భావాన్ని అన్యోన్యత భావాన్ని మత సమరస్య భావాన్ని పెంపొందించుటకు ఉపయోగపడతాయని అన్నారు. జాతరలో భాగంగా బుధవారం రథోత్సవం, గురువారం కుస్తి పోటీలునిర్వహించారు. ఈ కుస్తీల పోటీలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రం నుండి మల్ల యోధులు పాల్గొన్నారు. గెలుపొందిన వీరులకు బహుమతులు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. కుస్తీల పోటీలలో విజేతకు ఐదు తులాల వెండి కడియం గ్రామ అభి-వృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బహుకరించారు. జాతర సందర్భంగా జడ కొప్పు కళాకారుల ఆధ్వర్యంలో జడ కొప్పు వేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గొవ్వూర్ నరేష్ రెడ్డి, దేవిదాస్, వెంకట్రామ్, శ్రీనివాస్, రామచందర్ రెడ్డి, సాయి రెడ్డి, ప్రవీణ్, సాయిలు, శ్రీకాంత్, సంజీవ్, పెద్ద కాపు సతీష్, సాయిరాం, రాజేష్, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా క్యారం పోటీలు



క్యారంలో పోటీల్లో పాల్గొన్న జట్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మొదటి రెండు రోజులు ఇన్స్టిట్యూషనల్ జట్ల మధ్య మ్యాచులు జరగనున్నాయి పోటీలన్నీ హెూరాహెూరీగా జరిగాయి. పురుషుల జట్టు విభాగంలో ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా జైన్ ఇరిగేషన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో 2-1 తేడాతో జైన్ ఇరిగేషన్ జట్టు విజయం సాధించింది. సిద్ధాంత వాడేకర్ (ఏ ఏ ఐ) అభిజిత్ త్రిపాంకర్ (జే ఐ ఎస్ ఎల్) మధ్య జరిగిన మ్యాచ్లో సిద్ధార్థ వాడేకర్ 08 -22, 25-22, 25-22 తేడాతో గెలువగా, జైద్ అహమద్ (జేఐఎస్ఎల్), శివ దయాల్ (ఏఏఐ) జరిగిన మ్యాచ్లో 13-17, 25-14, 23-18 జైద్ అహ్మద్ గెలుపొందగా, సందీప్ దీవే, రహీం ఖాన్ - ముష్రఫ్ వహీద్ ఇబాల్‌ల మధ్య జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో జేఐఎస్ఎల్ జట్టు విజయం సాధించింది. మహిళల జట్టు విభాగంలో సిసిఎస్ సిఎస్బి జెడ్సి ఏజి జట్టుపై రెండు ఒకటి తేడాతో గెలుపొందింది. మ్యాచ్ వివరాలు వినీత (సిసిఎస్‌సి ఎస్) బి స్వర్ణలత (సిఏజి)లలో 22-17, 19 - 16, తేడాతో వినీత గెలుపొందింది. రెండవ మ్యాచ్లో నీలం గౌడ్ ఆర్ షర్మిల సి ఏ జి జరిగిన సింగిల్స్ మ్యాచ్లో 7- 24, 23- 10 ,20 -10 తేడాతో నీలం విజయం సాధించగా గీత శంకర్ రింకి రాజన్ సిఐజి జట్టు సవితాదేవి సమిధ (సిసిఎస్సిఎస్బి) మధ్య జరిగిన డబుల్ మ్యాచులు 25 -1, 20- 23, 25- 7 తేడాతో సిఐజి జట్టు విజయం సాధించింది.

బిసిల జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీఎల్‌పీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం కుల జనగణన అనంతరం బిసి కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్ అమలుతో ఎన్నికలు నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి, ఎంబిసిలకు వర్గీకరణతో కూడిన బిసి రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిసి కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్ అమలుతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేయని రాజకీయ పార్టీలు బిసి ద్రోహులే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధిస్తే కుల జనగణన నిర్వహించి స్థానిక సంస్థలకు 42శాతం రిజర్వేషన్ అమలుతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. గతంలో స్థానిక సంస్థలకు బిసి రిజర్వేషన్ 33శాతం ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం 25 శాతానికి తగ్గించి 18% బిసి కులాల రిజర్వేషన్ అమలు చేసి రాజకీయంగా బిసి కులాలకు తీరని ద్రోహం చేసిందని దండి వెంకట్ ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో బిసి కులాల సంఘాలు కుల జనగణన అనంతరం జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్ అమలుతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. బిసి రిజర్వేషన్ అంశంపై కలిసి వచ్చే సంఘాలు, రాజకీయ పార్టీలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత, నగర అధ్యక్షులు ఎం. అజయ్, జిల్లా కమిటి సభ్యులు దండు జ్యోతి, గీతాంజలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్‌పీ నాయకులు

రైతులు విత్తనాలు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జుక్కల్

రైతులు విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు కొనేటప్పుడు తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో విశాల్ తెలిపారు. హంగర్గ క్లస్టర్ పరిధిలోని పెద్దగుల్లా, నాగల్‌గావ్, డోన్గాం, ఖండేబల్లూర్, జుక్కల్, నాగల్‌గావ్ తదితర గ్రామాలలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఈవో విశాల్

నారుమళ్లు సిద్ధం

నవతెలంగాణ-రెంజల్



వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం రైతులు దుక్కులు దున్ని నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. మండలం లోని బోరుబావుల కింద ఉన్న రైతన్నలు నారుమళ్లను పోసుకొని వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతన్నలు, వ్యవసాయ భూములను దుక్కి దున్నిస్తున్నారు. తమ పంట పొలాల్లో సారవంతమైన మట్టిని తరలించి భూసారాన్ని పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలు చెరువుల్లో మట్టి పనులు చేపడుతుండగా.. ఆ చెరువు మట్టిని తమ పంట పొలాల్లోకి తరలిస్తున్నారు.



ఎల్లారెడ్డి : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

బుద్ధుని మార్గం శ్రేష్టమైనది

- ఘనంగా గౌతమ బుద్ధుని జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/బోధన్

పట్టణ కేంద్రంలో గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను గురువారం అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళికి బుద్ధుని మార్గం అత్యంత శ్రేష్టమైనదని బుద్ధుడు ఏ విషయాన్ని అయినా మత గురువు చెప్పాడనో, మత గ్రంథంలో రాసిందనో, తాత ముత్తాతలు పాటిస్తున్నారని దేనినైనా గుడ్డిగా నమ్మవద్దని, పరిశీలించి అందరికీ యోగ్య మైందని తేలితేనే అనుసరించాలని ప్రబోధించిన మార్గదాత అని అన్నారు. అందరూ బుద్ధుని మార్గంలో నడిచి ప్రపంచ శాంతిని కాంక్షించాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బబ్లూ, సాయిలు, మరులు సాయిబాబా, చిరంజీవి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : గౌతమ బుద్ధుని జయంతి, బుద్ధ పూర్ణిమ సందర్భంగా సాలూరా మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో గ్రామస్తులు బుద్ధ పూర్ణిమ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు సర్వ సర్వమానవాళికి ఎంతో శ్రేష్టమని, వాటిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు భీమ్‌రావ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు విఠల్, కార్యదర్శి రాములు, ప్రధాన కార్యదర్శి సయ్యాజీ, కోశాధికారి నితీన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం పట్ల నిర్లక్ష్యం

- ఉపాధి ఏపీఎంపై జడ్పిటిసి ధ్వజం

నవతెలంగాణ-పిట్లం



ఉపాధి హామీ ఏపిఎంను నిలదీస్తున్న జడ్పిటిసి

ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఉపాధిహామీ ఏపిఎం శివకుమార్‌పై జడ్పిటిసి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ శాఖపై ఏపీఎం శివకుమార్ ఉపాధి హామీ పనుల ప్రగతి నివేదిక అంశాలను వెల్లడిస్తున్న నేపథ్యంలో జోక్యం కలిగించుకున్న జడ్పిటిసి సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని హస్నాపూర్ గ్రామంలో రైతుల మనుగడకు పానాది రోడ్డును ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం పనులు చేయాలని గత మూడు సర్వసభ్య సమావేశాల నుంచి కోరుతున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ముందుగా వ్యవసాయాధికారి కిషన్ వ్యవసాయ శాఖపై మాట్లాడుతూ యాసంగిలో రైతులు పండించిన జొన్న కొనుగోల్లు పూర్తయ్యాయని, రెండుమూడు రోజులలో వరి ధాన్యం పూర్తవుతుందన్నారు. రైతుబంధు పథకం కింద రూ.13 కోట్ల 32 లక్షల 7 వేలు అందించినట్టు తెలిపారు. రైతులకు రాయితీపై అందించే జీలుగా, జనుము విత్తనాలు ప్రాథమిక సహకార సంఘాలలో అందుబాటులో ఉన్నాయని వాటిని త్వరలో పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఆర్అండ్‌బీ ఏఈ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ మంజూరైందని తెలిపారు. ఎంపీపీ కవిత ఐదు సంవత్సరాల కాలంలో ఆయా శాఖల పరంగా చేసిందేమీ లేకున్నప్పటికీ చిరుద్యోగులైన అంగన్వాడీ టీచర్లపై తరచూ బెదిరింపులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూనే కాలం గడిపిన ఆమె చివరి తన సర్వసభ్య సమావేశంలోనూ అక్కసు వెళ్ళగక్కారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్నవడ్లకు బోనస్ హర్షణీయం

- రైతుబంధు మండల సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం సీజన్ నుంచి సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించడం హర్షణీయమని రైతుబంధు మండల సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిడ్ డే మీల్స్, గురుకుల హాస్టల్స్, రేషన్‌షాపుల్లో, సన్నబియ్యం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, అందుకే సన్న బియ్యం పంపిణీ కోసం ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతీ రైతన్నకు క్వింటాలు వరిధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని, ఇచ్చిన హామీ అమలుకు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం యావత్ తెలంగాణ రైతాంగానికి శుభపరిణామమని పేర్కొన్నారు. రైతులను ప్రోత్సహించి సన్నధాన్యం సాగు పెంచాలని, బోనస్ అందిస్తామన్న నిర్ణయంతో ఈ వానాకాలం వరి సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరేనని సన్నరకాలు సాగుచేసిన రైతులకు క్వింటాకు రూ.150 బోనస్ ఇస్తామని ప్రకటించి మాట తప్పిందన్నారు. వారు ఇప్పుడు రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తు రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమన్నారు. సన్న వరి సాగును ప్రోత్సహిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి రైతాంగం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నర్సరీలో వందశాతం

సర్వైవల్ ఉండాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

నర్సరీలో వందశాతం సర్వైవల్ ఉండాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ అన్నారు. గురువారం గున్కుల్ గ్రామంలోని ఉపాధి హామీ పనులను, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు 200 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను ఆదేశించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేయాలని ప్రతిరోజు రూ.300 కూలి పడేవిధంగా పనిచేయాలని ఆయన కూలీలకు సూచించారు. నర్సరీలో ఉదయం సాయంత్రం నీటిని మొక్కలకు పట్టాలని వందశాతం నర్సరీలో సర్వైవల్ ఉండాలని ఆయన పంచాయతీ కార్యదర్శి అంజయ్యకు సూచించాడు. కంపోస్ట్ షెడ్డులో ఎరువుల తయారు చేయాలని, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు, వైకుంఠధామంలోని మొక్కలకు నీరు అందించాలని, ప్రకృతివనాన్ని శుభ్రంగా ఉంచాలని ఆయన కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో రథోత్సవాలు

- అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రథంగల్లీలో గల శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం సంతోష్ మేస్త్రి ఆధ్వర్యంలో అన్నదానం పెద్దఎత్తున నిర్వహించారు.





రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న పలువురు

రథోత్సవాల కోసం

శిఖరాన్ని ఎక్కించిన మాన్కార్ పటేల్..

మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవాలు ఈనెల 23, 24 తేదీలలో జరగనున్నాయి. గురువారం ఉదయం రథోత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ ప్రతానికి మాన్కార్ పటేల్ నాగనాథ్ హనుమాన్లు కృష్ణ పటేల్ వారి కుటుంబ సభ్యులతో భాజా భజంత్రీలతో ఇంటి నుండి తీసుకు వచ్చి రతానికి శిఖరాన్ని ఎక్కించారు. వెంకట్ మహారాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ స్వామి ప్రతానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ప్రతాన్ని గురువారం రాత్రి మండల కేంద్రంలో ఊరేగించారు. లక్ష్మీనారాయణ ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమై మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో గల ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా లక్ష్మీనారాయణ ఆలయానికి తీసుకువస్తారు.

టీఎస్ ఈసెట్‌లో ఉత్తమ ర్యాంక్

నవతెలంగాణ-భిక్కనూర్



అశ్రిత

టీఎస్ ఈసెట్ ఫలితాలలో పట్టణ కేంద్రానికి చెందిన ఆశ్రిత రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు దయానంద్ కిరణ్మయి దంపతుల కూతురు ఆశ్రిత హైదరాబాద్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సు పూర్తి చేసుకొని ఇంజనీరింగ్ చదివేందుకు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాయగా అందులో రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల పట్టణ ప్రజలు విద్యార్థి తల్లిదండ్రులను, విద్యార్థినిని అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



సాయిలు (ఫైల్)

వ్యక్తి అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఒంటెద్దు సాయిలు కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 16న ఉదయం 7గంటల సమయంలో కామారెడ్డి రైల్వేస్టేషన్ వద్ద తన బండిని తన అన్న కొడుకు అయిన శ్యాంకు అప్పజెప్పి రెండు మూడు రోజుల్లో వస్తానని చెప్పి, అక్కడి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతని భార్య ఒంటెద్దు అనిత గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి ఎడమ చేతిపైన 'అమ్మ' అనే పేరు, కుడి చేయి భుజంపైన లవ్ సింబల్‌తో 'రెజీనా' అనే పేరుతో పచ్చబొట్టు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. అతని ఆచూకీ తెలిసిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

పారిశుధ్యం లోపించొద్దు

- ఎంపీఓ అబ్బగౌడ్



మాట్లాడుతున్న ఎంపీఓ అబ్బగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ అబ్బగౌడ్ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అంతే కాకుండా హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యదర్శుల ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన అన్నారు. సమావేశంలో కార్యదర్శులున్నారు.

విద్యార్థి సంఘం నాయకులపై కుట్ర కేసును వెనక్కి తీసుకోవాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులపైన బనాయించిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మోజీరామ్, నాయకులు సుమన్, ప్రవీణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడి నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న వినయ్‌కుమార్

నవతెలంగాణ-గాంధారి

యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా వినయ్ కుమార్‌ను నియమించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశానుసారం నియమించినట్టు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధారి టౌన్ అధ్యక్షులు సంగనీ బాబా, చాకలి రాజు, మోహన్, గోవర్ధన్, భాస్కర్, మధు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అకాలవర్షం.. ఈదురుగాలులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ప్రజలు అతలాకుతలమయ్యారు. దీంతో రాత్రిపూట కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది. కరెంటు స్థంబాలు నేల కూలాయి. భారీ ఈదురుగాలుకు చెట్లు సైతం నేలకొరిగాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. భూంపల్లి నుండి దగ్గి వెళ్లే రహదారిపై వృక్షం నేల కూలింది. హోటళ్లపై, ఇండ్లపై ఉన్న రేకులు ఊడి రోడ్లపైన, ఇతరుల ఇండ్లపై పడ్డాయి. మరికొందరి ఇండ్లలోకి నీరు చేరాయి. కరెంట్ లేక పోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సదాశివనగర్ అయ్యప్ప దేవాలయం వద్ద పెద్ద రేకుల షేడ్ లేచిపోయింది.



సదశివనగర్: ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్టు

గాలివానకు తెగిన విద్యుత్ తీగలను మరమ్మతు..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఎర్రమన్నుకుచ్చ ప్రాంతంలో బుధవారం రాత్రి గాలివానకు విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి రాత్రంతా అంధకారం నెలకొనడంతో స్థానికులు గురువారం వార్డు కౌన్సిలర్ అల్లం శ్రీను దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారితో చల్లాచెదురై తెగిపడిన విద్యుత్ తీగలను దగ్గరుండి సరి చేయించి 120 ఫీట్ల కొత్త వైరు తీసుకొచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వెంటనే స్పందించి విద్యుత్ శాఖ వారితో మరమ్మతులు చేయించి విద్యుత్ సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్‌కు పలువురు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. తన వార్డు పరిధిలో ఏ సమస్య వచ్చినా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన అన్నారు.



ఎల్లారెడ్డిలో విద్యుత్ వైర్లు సరిచేస్తున్న సిబ్బంది

కోటగిరి : ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుని భగభగలతో ఇంట్లో నుంచి బయటకు రాకుండా ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం ఐదున్నర గంటలైనా సూర్యుని ప్రతాపం తగ్గడం లేదు. 7 గంటలకు ప్రజలు రోడ్డు మీదకు వస్తున్నారు. సాయంత్రం కాగానే ఈదురుగాలులతో వీచడంతో దాంతో దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కోటగిరి: ఎండతో నిర్మానుష్యంగా మారిన ప్రధాన చౌరస్తా

విరాళ దాతకు ఘనసన్మానం


విరాళ దాతను సన్మానిస్తున్న క్రీడాకారులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో క్రీడాకారుల సౌకర్యార్థం నిర్మితమౌతున్న ఇండోర్ స్టేడియం కొరకు తన వంతు సహాయంగా ముప్కాల్‌కు చెందిన గడ్డం సంతోష్ రెడ్డి తన వంతు సహాయంగా రూ.25 వేల రూపాయలను (50 కుర్చీల నిమిత్తం) విరాళంగా అందజేశారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గంగాధర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా గడ్డం సంతోష్ రెడ్డిని పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు ముస్కు నర్సయ్య, టి.సాయన్న, గద్దల గంగారాం, మోతె గంగారెడ్డి, ముస్కు శ్రీను, క్రీడా ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం


అన్నదానం కార్యక్రమంలో గ్రామస్తులు

నవతెలంగాణ-ముప్కాల్

పౌర్ణమి పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వేంపల్లి, రెంజర్ల, నల్లూర్, కొత్తపల్లి, నాగంపేట్ తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని వెంచిర్యాల గ్రామంలో శ్రీవారి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులు భగవంతునికి నైవేద్యం సమర్పించి, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంచిర్యాల గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు


బుద్ధజయంతిలో పాల్గొన్న కౌన్సిలర్, నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వ జ్ఞాన సంపన్నుడు.. సకల జీవరాశి ప్రేమికుడు.. ఈ ప్రపంచంలో మనిషి ఎలా బతకాలో చెప్పిన తాత్వికుడు... స్వేచ్ఛ స్వతంత్ర సమానత్వం' కరుణ, ప్రజ్ఞ, న్యాయాన్ని ప్రతి స్థాపన కోసం తన కుటుంబాన్ని రాజ్యాన్ని రాజ్యాధికారాన్ని వదులుకొని స్వార్థ భావజాలంతో కలుషితమైన సమాజ వ్యవస్థలో "వ్యవస్థ పరివర్త" నే లక్ష్యంగా ముందుకు కదిలిన గౌతమ బుద్ధుడు జయంతి (వైశాఖబుద్ధ పూర్ణిమ)ని పురస్కరించుకున గురువారం పట్టణంలోని అశోక్ నగర్(డబల్ బెడ్ రూమ్)లోని పురాతన బుద్ధ విహార్‌లో బుద్ధవందనం, బుద్ధ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తలారి చందు మీనా, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఉపాధ్యక్షుడు ముగా ప్రభాకర్, షెట్పల్లి నారాయణ, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్, మున్సిపల్ కార్మికుల జేఏసీ అధ్యక్షుడు పింజ అశోక్,సీనియర్ అంబేద్కర్ వాదీ భీంగల్ సురేష్, బౌద్ధ ఉపసకులు అంబులెన్స్ రాజు, వికాస్ పవర్, రాజేందర్ పాల్గొని బుద్ధుని జీవిత చరిత్ర, ఆయన సమజాహితం కోసం పాటుపడ్డ విషయాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. అశోక్ నగర్‌లోవున్న బుద్ధ విహార్‌ల్లో కొందరు ఆకతాయిలు రాత్రి పూట మద్యం సేవించి అందులోని బుద్ధుని ప్రతిమను రాళ్లతో కొట్టి పాడుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బుద్ధ విహార్ నిర్మాణం కొరకు 3 లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా బుద్ధవిహార్ అభివృద్ధికి 5లక్షల రూపాయలు కేటాయించి విహార్ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేక సేవలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ట్రాన్స్‌జెండర్లకు ఓపి సేవలు అందుబాటులో వచ్చాయని జిల్లాలోని ప్రతి ఒక్క ట్రాన్స్ జెండర్ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు నిత్యం ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడి ఎక్కడ తమ ఆరోగ్య సమస్యలు ఏ డాక్టర్కు ఏ ఆసుపత్రిలో చూపించుకోవాలో తెలియక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసం చక్కని పరిష్కారం చూపే విధంగా ఓపి సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రెండవ అంతస్తులో రూమ్ నెంబర్ 254లో ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి కోటేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ శేషాద్రి రెడ్డి, స్నేహ టీఐ ప్రాజెక్ట్ స్టాఫ్, ట్రాంజెండర్లు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దె విషయంలో గొడవ

- ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లో ఒక కారు అద్దె విషయంలో యజమానికి ,అద్దెకు తీసుకున్న వ్యక్తికి మధ్య బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగిన గొడవలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి ..మాట్లాడుకుందామని పిలిచి కొందరు దాడి చేసినట్లు తెలిసింది ..ఈ ఘటనలో 26 సంవత్సరాల యువకుని తలకు తీవ్ర గాయాలు అయ్యాయి... మొదట పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ,మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడినుండి నిజాంబాద్ కు తరలించినారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

28న ద్విచక్ర వాహనాల వేలం

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసులలో కట్టుబడిన రెండు ఎలక్ట్రికల్ వాహనాలను ఈనెల 28న వేలంపాట నిర్వహిస్తున్నట్లు మోర్తాడ్ ఎక్సైజ్ సీఐ గుండప్ప గురువారం తెలిపారు. ఆసక్తి గలవారు ముందస్తుగా 25 శాతం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గుర్తు తెలియని యువతికి తీవ్ర గాయాలు

- ఆస్పత్రికి తరలించిన ఎడపల్లి పోలీసులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జా నకంపేట్ సమీపానగల మల్లన్న గుడి దగ్గర కాలువ కట్టపై ఓ గుర్తు తెలియని యువతి గాయాలై ఉండడంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. దీంతో ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణరెడ్డి, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న యువతిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడ్డ యువతి

పక్కదారి పట్టించే స్క్రిజో ఫ్రేనియా

- నేడు ప్రపంచ స్క్రిజో ఫ్రేనియా దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

రోజు రోజుకు మారుతున్న జీవన విధానంతో చాలామంది ఏదో ఒక రకమైన మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. కుటుంబంలో ఏ ఒక్కరు అనారోగ్యానికి గురైన మిగతా సభ్యులంద రికీ ఇబ్బందిగా ఉంటుంది. అనారోగ్యం అయితే ఆ ఇల్లు ప్రశాంతతకు బదులు అశాంతికి నిలయం అవుతుంది. నేడు 24 శుక్రవారం ప్రపంచ స్రిజోఫ్రేనియా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం...

ఒక తీవ్రమైన మానసిక వ్యాధి...

స్రీజోఫ్రేనియా అనేది మనిషి ఆలోచనలు అనుభూతులు పక్కదారి పట్టించడం ద్వారా వ్యక్తి ప్రవర్తనలో విపరీత మార్పులు తెచ్చే ఒక తీవ్రమైన మానసిక వ్యాధి. ఈ జబ్బు సోకినవారు బయట జరిగే వాస్తవాలకు మధ్య తేడాను గుర్తించలేరు. అందువల్ల వారి ఆలోచనలు, మాటలు, ప్రవర్తనలో తేడాలు కనబడతాయి. ఇతరులకు వినబడని శబ్దాలు వీరికి వినిపిస్తాయి. ఇతరులకు కనిపించినవి వీరికి కనిపిస్తాయి. తమలో తామే మాట్లాడుకోవడం నవ్వుకోవడం చేయవచ్చు. ఒక వ్యక్తి నుంచి సమాజం ఆశించే సరాసరి ప్రవర్తనకు పూర్తి భిన్నంగా వీరి ఆలోచనలు, ప్రవర్తన ఉంటుంది. ప్రతి వంద మందిలో ఒకరు ఈ వ్యాధికి గురవుతుంటారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఎవరికైనా ఏ వయసులోనైనా ఈ జబ్బు రావచ్చు. మగవారిలో 15 నుంచి 30 ఏళ్ల మధ్య, మహిళల్లో 25 నుంచి 30 ఏళ్ల వారిలో ఎక్కువగా మొదలవుతుంది. కుల, మత ప్రాంత రంగు జాతి భేదాలు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 100 మందిలో ఒకరు ఈ జబ్బు బారిన పడుతున్నారు.

వ్యాధి ప్రారంభానికి ముందు లక్షణాలు..

ఈ వ్యాధి ప్రారంభంలో వారు తమ పనులు చేసుకోవడానికి కావలసిన ఫోకస్ కోల్పోతారు. ఏదైనా ఉద్యోగం ప్రారంభంలో బాగా చేస్తారు. ఆ తర్వాత ఏం చేయాలో తెలియక తికమక చెందుతారు. పనిని సగంలోనే వదిలేస్తారు. ఆ తర్వాత కాలేజీ, ఉద్యోగానికి వెళ్లడం మానేసి ఇంట్లోనే ఉండడం ఆరంభిస్తారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం కష్టం. ఒకవేళ గుర్తించి చికిత్సను అందిస్తే వారిలో కలిగే మనో క్షీణితను ఆపవచ్చు. ఈ వ్యాధి ఆలోచన, ఆచరణ భావావేశాల మధ్య సమన్వయం తీవ్రంగా దెబ్బతింటుంది. అంటే మనసులోని ముఖ్య విధుల మధ్య చీలిక ఏర్పడుతుంది. అందుకే స్కిజోఫ్రీనియా అంటే చీలిపోయిన మనసు అన్నారు.

వ్యాధి చికిత్స నివారణ చర్యలు..

ఈ వ్యాధి ఉన్నవారు జీవితాంతం మందులు వాడాల్సి వస్తుంది. ఈ మందులు మెదడులో జరిగే మార్పులను యధావిధిగా సాధారణ స్థితిలో ఉంచేందుకు తోడ్పడతాయి. మందులు ఆపివేస్తే వ్యాధి ముదిరే అవకాశం ఉంటుంది. అలాగే రక్తపోటు, మధుమేహం మందుల్లాగా మందు వాడుతూ లక్షణాలను నియంత్రణలోకి పెట్టుకోవాలి.

ఎక్కువగా ఆలోచించొద్దు



స్కిజో ఫ్రేనియా దీనినే మన అచ్చ తెలుగులో పిచ్చి లేదా ఉన్మాదం అని పిలుచుకుంటాం. ఈ వ్యాధి బారిన పడ్డ వాళ్ల వింత ప్రవర్తన చూసి ఇప్పటికీ దెయ్యం పట్టిందని, భూతం ఆవహించిందని తదితర మూఢ నమ్మకాలతో మాంత్రి కుల దగ్గరకి తీసుకెళ్లడం చూస్తున్నాం. ఏ విషయమైనా ఎక్కువగా ఆలోచించడం మానివేయాలి

సి. రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్మూర్

ఎలా వస్తుంది ... ఎందుకు వస్తుంది...

మెదడులో నాడుల మధ్య సమాచారాన్ని చేసే న్యూరో ట్రాన్స్ మీటర్లు అని పిలిచే తుర్ఫేమిన్ గుల్టామెంట్ సెరటోనిన్ లాంటి అనేక రసాయనిక పదార్థాలు క్రమం తప్పి పని చేయడం వల్ల జబ్బు లక్షణాలు కనబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు ఒక్కసారిగా కనబడవు మనోబలం కోల్పోతారు. లక్షణాలు బయటపడక ముందే వ్యాధిని గుర్తించి చికిత్స చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ వ్యాధి జన్యుపరమైన కారణాలు, వ్యక్తి తల్లి గర్భంలో ఉన్నప్పుడు, ప్రసవం జరిగేటప్పుడు, ప్రసవం తర్వాత పెరిగే దశలో ఏవైనా కారణాల వల్ల నాడీ కణాల ఎదుగుదల అస్తవ్యస్తంగా జరుగుతుంది. తర్వాత తల్లిదండ్రుల పెంపకం టీనేజీ, తొలి యవ్వన దశలో తనకు కలిగే ఒత్తిడి వల్ల మెదడు రసాయనాలు శాశ్వత మార్పులు జరిగి ఈ వ్యాధి బయట పడుతోంది. వ్యక్తి తీవ్రమైన ప్రవర్తనతో చుట్టూ ఉన్న వారికి గాని తనకు గాని ఇబ్బంది కలిగిస్తున్నప్పుడు అందరికీ దృష్టిలోకి వస్తుంది

కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో అవసరం



మానసిక వ్యాధుల్లో అతి ముఖ్యమైన వ్యాధి సైకోసిస్. ఈ వ్యాధి బారిన పడిన వాళ్లకు కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో అవసరం. ఎందుకంటే రోగులకు తమకు జబ్బు ఉందనే విషయమే తెలియదు. కాబట్టి ప్రేమతో సాయం చేస్తే మానసిక రోగాలు పూర్తిగా తగ్గిపో తాయి.

డాక్టర్ బి. కేశవులు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, నిజామాబాద్.

రిజర్వేషన్ ఖరారు కాకముందే..

- పల్లెల్లో పంచాయతీ ఎన్నికల జోరు



నవతెలంగాణ-మోపాల్

జిల్లాలో గ్రామపంచాయతీల రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్ రాకముందే, సర్పంచ్ ఎన్నికలపై గ్రామలలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంది. ఇంకా రిజర్వేషన్ కూడా పూర్తి కాలేదు కానీ పల్లెల్లో రాజకీయ వాతావరణ మాత్రం వేడెక్కుతుంది. ఒకవేళ పాత రిజర్వేషన్ వస్తుందా.. లేకపోతే కొత్తగ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది కదా రిజర్వేషన్లు మార్పులు చేర్పులు ఉంటాయని ఆశావాహులు మాత్రం గంపెడు ఆశలతో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సర్పంచ్ పదవికి పోటీ తీవ్రంగానే ఉంటుంది. రోజురోజుకీ రాజకీయ నిరుద్యోగిత పెరిగిపోతుంది కాబట్టి సర్పంచ్ పదవికి అధిక ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఒకవేళ రిజర్వేషన్ మగవారికి కాకుండా మహిళా రిజర్వేషన్ ఏర్పడితే వారి సతీమణులను కూడా ఎన్నికల్లో పోటీ చేయించడానికి సైతం ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత కూడా ఈసారి గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఇప్పటినుండే పోటీ చేయడానికి నూతన ఉత్సాహం చూపుతున్నారు. గ్రామంలో సర్పంచ్ పదవికి ప్రత్యేక స్థానం ఉంటుంది కావున ఈసారి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు సైతం లెక్కచేయకుండా ఉన్నారు .మేజర్ గ్రామపంచాయతీలకైతే నలభై లక్షల పైబడి ఖర్చు చేయడానికి కూడా ఆశావాహులు మొగ్గు చూపుతున్నారు. ఒకసారి అదృష్టం కలిసి వస్తే ఐదు సంవత్సరాలు గ్రామంలో మనది రాజ్యం అని చూస్తున్నారు. కానీ సర్పంచ్ ఎన్నికల్లో ప్రత్యేక వాతావరణం ఉంటుంది. ఎక్కడ కూడా రాజకీయ పార్టీల గుర్తులపై పోటీ చేసే నిబంధన గ్రామపంచాయతీలకు రాజ్యాంగంలో లేదు. కాబట్టి ఒకే పార్టీకి సంబంధించిన ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కూడా సర్పంచ్ పదవికి పోటీ చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో పోటీ చేసే వ్యక్తి యొక్క అంగ బలం మరియు ఆర్థిక బలం పైనే సగం గెలుపు ఆధారపడి ఉంటుంది. మిగతా సగం తమ కుల రాజకీయం పైన కూడా ఆధారపడి ఉంటుంది. ఒకవేళ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి మరోసారి ఎన్నికల్లో పోటీ చేస్తే అతనిపై సానుభూతి మాత్రం చాలా మట్టుకు తమ గెలుపునకు ఉపయోగపడుతుంది. దేశానికి రాష్ట్రపతి ప్రథమ పౌరుడైతే, గ్రామానికి సర్పంచ్ ప్రథమ పౌరుడు. కాబట్టి గ్రామాల్లో వివిధ రకాల ఎన్నికల్లో కంటే సర్పంచ్ పదవికి మాత్రం ప్రత్యేకత ఉంటుంది. చాలామంది ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తమ రాజకీయ జీవితం సర్పంచ్ పదవి నుండి తమ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. కాబట్టే ఈ పదవికి ప్రత్యేక స్థానం నెలకొంది. వేచి చూడాలి ఏ గ్రామానికి ఏ రిజర్వేషన్ వస్తుందో.. ఎవరికి ఆ పదవిలో కూర్చునే అదృష్టం వరిస్తుందో..

1962 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ


అంబులెన్స్‌ను తనిఖీ చేసిన డాక్టర్ భాగీష్ మిశ్రా

నవతెలంగాణ-ఆర్మూర్

1962 అంబులెన్స్‌ను స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భాగీష్ మిశ్రా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1962 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ వైద్య సేవలను మూగజీవాలకు అందించాలని అదేవిధంగా అంబులెన్స్ యొక్క వివిధ రకాల పరికరాల పనితీరు, మందులను పరిశీలించారు. మూడు నెలల నుంచి పశువులకు అందించిన సేవలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్ సిబ్బంది అందిస్తున్న సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి ఎగ్జిక్యూటివ్ విజేందర్, డాక్టర్ కాంతయ్య, పారావేట్ అరుణ్ కుమార్, కెప్టెన్ ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ పరీక్షకు 88శాతం మంది విద్యార్థులు హాజరు

నవతెలంగాణ- నిజామాబాద్ రూరల్

తెలంగాణ ఎడ్‌సెట్ -2024 ప్రవేశ పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ విధానంలో గురువారం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 87 శాతం మంది హాజరైనట్లు టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని ప్రకటించారు. టీఎస్ ఎడ్‌సెట్‌కు 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. సెషన్-1లో 16,929 మందికి గానూ 14,633 మంది, సెషన్-2లో 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తొలి సెషన్‌ను ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్‌ను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 79 సెంటర్లలో పరీక్షల నిర్వహణ కొనసాగింది. దానిలో భాగంగా నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో కలిపి నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. దానికి గాను 670 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా 596 అభ్యర్థులు హాజరైనట్లు అనగా 88శాతం ఆదర్శ ఉన్నట్లు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు.

పట్టణంలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-ఆర్మూర్

కాలుష్య నియంత్రణ మండలి సూచనలను మేరకు మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశానుసారం గురువారం పట్టణంలోని పలు హోటల్స్‌లో, బేకరీలలో ప్లాస్టిక్ పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పట్టుబడిన ప్లాస్టిక్‌ను సీజ్ చేసి 10,500 రూపాయల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, మున్సిపల్ సిబ్బంది వెంకటేష్ అక్షయ్, రవి, ప్రశాంత్, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-దోమకొండ

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ శారదా, ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశాన్ని ఆయాశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలి

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


కూలీలతో మాట్లాడుతున్న ఎస్. సురేష్

ఉపాధి హామీ పనికి వచ్చే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.సురేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో కాడి చెరువులో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.సురేష్ మాట్లాడుతూ 2005లో ఇచ్చిన జాబ్ కార్డులు తప్ప ఇంతవరకు కొత్త జాబు కార్డులు ఇవ్వలేదని అన్నారు. ఒక్కొక్క కార్డు మీద ఆరుగురు ఏడుగురు ఉన్నారని, ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2005-06 సంవత్సరంలో అనేక పోరాటాల ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వచ్చిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో కోతలు పెడుతుందన్నారు. పని మీదికి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు వేలి ముద్రలు పెట్టాలని, కొలతలతో పనిచేయాలని అనేక ఆంక్షలు పెడుతూ కార్మికులను పనికి దూరం చేయాలనే ఆలోచనతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎవరికి లేని నిబంధనలు కూలి నాలి చేసుకునే వారికి పెట్టడం అనేది హేయమైన చర్య అని వి మర్శించారు. ఇప్పటికైనా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు రోజువారిగా 600 రూపాయలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి 20 వేల రూపాయల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెట్లకు నెలకు 10వేల రూపాయలు ఇవ్వాలని, ప్రతి కూలీకి గుర్తింపు కార్డు ఇవ్వడంతోపాటు ప్రతి మనిషికి 200 రోజులు పని కల్పించాలన్నారు. ప్రమాద బీమా ప్రభుత్వమే చెల్లించి ఇన్సూరెన్స్ కట్టాలన్నారు.

'దోస్త్'లో డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందుటకు దోస్త్ ఆన్లైన్ ద్వారా అవకాశం కలదని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ టీ.వేణుగోపాల స్వామి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో బిఏ, బీకాం, బీఎస్సీ ఇంగ్లీష్ మీడియం కోర్సులకు 60 సీట్ల చొప్పున అవకాశం కలవని పేర్కొన్నారు. బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల విద్యార్థులకు డిగ్రీ చదవడానికి మంచి అవకాశం ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని ఆర్మూర్ కోర్టు జడ్జి వేముల దీప్తి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హరి కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం అవరణంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత గంజాయి, మద్యం లాంటి చెడు అలవటులకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు. రాజ్యాంగ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, తహశీల్దార్ షబ్బీర్, ఎంపిఓ శ్రీనివాస్, ఎస్సై సుదీర్ రావు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ టీం సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామపంచాయతీలో సెంట్రల్ సెక్రటేరియట్ టీం సందర్శించింది. గురువారం వైద్య, రెవెన్యూ శాఖపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సెంట్రల్ టీం సభ్యులు

రుణమాఫీపై రైతులకు కోటి ఆశలు

- రైతుల వివరాలు అందిస్తున్న బ్యాంక్ సిబ్బంది
- అప్పులనుంచి రైతులకు ఉపశమనం
- కామారెడ్డి జిల్లాలో మూడు లక్షల మంది రైతులు మేలు



నవతెలంగాణ-లింగంపేట్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15లోగా 2 లక్షల రుణమాఫీ చేస్తామని బహిరంగ సభలో ప్రకటించారు దీంతో చిన్న సన్నకారు రైతులు రుణమాఫీ కోసం కోటి ఆశలు పెట్టుకున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రైతులు పంట రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది దీంతో బ్యాంకర్లను రైతుల వివరాలు అందించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. 2 లక్షల రూపు రుణమాఫీ ఉన్న రైతుల వివరాలు సేకరించడంతో రైతుల్లో ఆశలు చిగురస్తున్నాయి.

ఒకవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్ని ఎరువులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు పెట్టుబడి సాయం లేక అప్పులు చేసుకొని ముందస్తుగానే ఎరువులు, విత్తనాలు తెచ్చుకునే పనిలో నిమగ్ధమవుతున్నారు. దీనికి తోడు ఆగస్టు 15 లోగా రెండు లక్షల రుణమాఫీ చేయనుండడంతో అప్పుల ఊబి నుండి బయటపడతామని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణాలు కట్టలేక దిగుబడులు రాక రైతులు అప్పులపాలు అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తే రైతులకు అప్పుల నుండి విముక్తి కలుగుతుంది. కొంతమంది రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకున్నారు. మరి కొంతమంది రైతులు చేసుకోలేదు. బ్యాంకర్లు రైతులకు మొదటికే పంట రుణాలు బకాయి ఉండటంతో యాసంగిలో పంట రుణాలనుందించలేదు. రైతులు విధిలేని పరిస్థితుల్లో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

రైతుల వివరాలు అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికల్లో ఆగస్టు 15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఐసిఐసిఐ బ్యాంక్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సహకార బ్యాంకుల నుండి ఎంతమంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు.. వారి వివరాలను బ్యాంకు సిబ్బంది సొసైటీ సిబ్బంది ప్రభుత్వానికి అందించటానికి సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులోగా వివరాల అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో బ్యాంకు సిబ్బంది రైతుల వివరాలను అందించడంలో నిమగ్నమయ్యారు. రెండు లక్షల రుణమాఫీ డిసెంబర్ 7వ తారీకు కటాఫ్ తేదీగా నిర్ణయించింది. అప్పట్లో గా ఒక్కొక్క రైతు ఎన్ని లక్షల పంట రుణాలు ఏ బ్యాంకుల్లో తీసుకున్నాడు. వారి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెలాఖరులోగా రైతుల వివరాలను సేకరించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రైతుల నివేదికలు ఈనెలాఖరులో అందించాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్లు ఆదేశించారు. ఈమేరకు రైతుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

మూడు లక్షల మందికి మేలు

కామారెడ్డి జిల్లాలో 3 లక్షల96 వేల మంది రైతులు ఉన్నారు. మూడు లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. లింగంపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో 5500 మంది రైతులు ఉన్నప్పటికీ ఇందులో 2 వేల ఒక వందమంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. లింగంపేట ప్రాథమిక వ్యవసాయ శాఖ సంఘంలో 1700 మంది రైతులు రెండు లక్షల రుణమాఫీకి వర్తించే అవకాశాలు ఉన్నాయి. శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2200 మంది రైతులు ఉండగా 480 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 3520 మంది రైతులకు గాను 1289 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో 127 రైతులు రుణంతీసుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఆయా బ్యాంకుల పరిధిలో 3 లక్షల పైగా మంది రైతులు పంట రుణాలు4500 కోట్ల రూపాయలు రైతులు తీసుకన్నారని సంబంధిత బ్యాంకర్లు చెబుతున్నారు. మూడు లక్షల మంది రైతులకు రుణమాఫీ పొందే అవకాశాలున్నాయి.మరో మూడు నెలలు ఆగస్టు 15 లోపు రుణమాఫీ ప్రభుత్వం చేయడానికి సిద్ధంగా ప్రణాళిక రూపకల్పన చేయడంతో రైతులు రుణమాఫీపై ఆశలు పెట్టుకున్నారు.

బాకీ పోతుంది-కొమ్ముల శ్రీనివాస్-మెంగారం

లింగంపేట ఐఓబి బ్యాంకు 1, లక్ష73, వేల 2016లో పంట రుణం తీసుకున్నారు. మిత్తికి మిత్తి కట్టలేకపోతున్న. బ్యాంకులో పంటపై తీసుకున్న పైసలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న. రుణమాఫీ చేస్తే బాకీ పోతుంది.

రెన్యువల్ చేసుకుంటున్నా:బద్ద లక్ష్మయ్య-పర్మళ్ల

లింగంపేట్ సొసైటీలో 80 వేల అప్పు తీసుకున్న. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంటున్నా. ఇప్పటిదాకా రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో షబ్బీర్ అలీ


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలం చుక్కాపూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో గురువారం ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి మహమ్మద్ అలీషబ్బీర్ పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవానికి తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. నరసింహస్వామి వారి ఆశీస్సులు మనందరిపై ఉంటాయన్నారు. కాంగ్రెస్ హయాంలో దేవాలయాల జీర్ణోద్ధరణ, పునరుద్ధరణ బాగా జరిగిందన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం షబ్బీర్ అలీ సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఇంత గొప్ప కార్యక్రమానికి పూనుకున్న ఆలయ కమిటీకి, గ్రామ ప్రజలకు అభినందనీయులు అన్నారు. రైతులకు, గిరిజనులకు, దళితులకు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే కాంగ్రెస్ పార్టీనీ మనమందరం కలిసి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో చూక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీధర్ రావు, మాచారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నౌసిలాల్, సీనియర్ నాయకులు ఎడ్ల రాజిరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి : బిఎల్‌టీయూ

నవతెలంగాణ-కామారెడ్డి

ఎంఎస్ లాంగర్ బీడీ కంపెనీ నిజామాబాద్ హెడ్ ఆఫీసు పరిధిలో నిర్మల్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో దేగాం, బస్వాపూర్, పాల్వంచ, తంగళపల్లి, ముస్తాబాద్, సిద్ధిపేట, లచ్చపేట్, నిజాంపేట తదితర బీడీ సెంటర్లలో బీడీ కట్టలకు బుర్రలు, (బాక్సులు) పెట్టే కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు, కూలీ రోజు రూ.600, నేలకు రూ.18000 జీతం పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని తెలంగాణ బహు జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నుంచి ఎంఎస్ లాంగర్ బీడీ నిజామాబాదు హెడ్ ఆఫీసులో కంపెనీ జనరల్ మేనేజర్ ఉమకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రాజుబాయి పటేల్‌కు డిమాండ్ నోటీసు అందజేశారు. అనంతరం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు సిరిగాద సిద్ధిరాములు మాట్లాడుతూ.. ఎం ఎస్, లాంగర్ బీడీ కంపెనీలో పనిచేయు బీడీ కట్టలకు బుర్రలు (బాక్స్ లు)పెట్టె, కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి ఎంఎస్ లాంగర్ బీడీ కంపెనీ వేతనాలు పెంచాల్సి ఉందని, కానీ కిందటి ఒప్పందం, తేదీ 30-4-2024, నాటికి ముగిసిందన్నారు. తేదీ 01-05-2024 నుంచి నూతన వేతన ఒప్పందంపై యాజమాన్యం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘంతో చేసుకోవాల్సి ఉంటుందని, బీడీ కట్టలకు బుర్రలు పెట్టె, కార్మికులకు రోజు రూ.600, నేలకు రూ.18000 పెంచాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, అందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కంపెనీ జనరల్ మేనేజర్ ఉమకాంత్ డిమాండ్ నోటీసుకు స్పందించి ఈ సమస్యలపై యాజమాన్యంతో చర్చించి త్వరలోనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర కోశాధికారి సయ్యద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు


మాట్లాడుతున్న సుంకరి విజయ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలోని మాల సంఘం ఆధ్వర్యంలో గురువారం బుద్ధ పౌర్ణమి, మహా జ్ఞాని తథాగత్ గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన, బుద్ధ వందనం, పంచాశీల, త్రిశరణ పాటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సుంకరి విజయ్ మాట్లాడుతూ... ఈ వైశాఖ పౌర్ణమి బౌద్ధంలో చాలా ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. బుద్ధుడు జన్మించిన రోజు, జ్ఞానోదయం, నిర్వాణం చెందిన రోజు, ఈ మూడు చారిత్రిక సంఘటనలు జరిగినది వైశాఖ పౌర్ణమి రోజే అని తెలిపారు. మహాజ్ఞాని తథాగత్ గౌతమ బుద్ధుడు విశ్వజ్ఞాన సంపన్నుడు, సకల జీవరాశి ప్రేమికుడు, అహింస సిద్ధాంత ప్రబోధకుడని అన్నారు. ఈ ప్రపంచంలో దుఃఖం ఉంది ఆ దుఃఖానికి కోరికలే కారణమని పంచశీల సూత్రాలను, అష్టాంగ మార్గాలను ప్రయోగించి శీలమును, నైతికతను బోధించిన మహా ప్రబోధకుడు, స్వేచ్ఛ స్వతంత్రం సౌభ్రాతత్వం న్యాయం, శీలం, కరుణ, ప్రేమ మొదలగు గుణాల నిర్మాణం ప్రపంచంలో బుద్ధుని జ్ఞాన భావజాలం నుండి పురుడుపోసుకున్నాయన్నారు. భారత దేశంలో పుట్టి సమస్త మానవాళికి శాంతి మార్గం చూపిన మహా మహాజ్ఞాని తథాగత్ గౌతమ బుద్ధుడని కొనియాడారు. కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు దేవి హరీష్, కార్యవర్గ సభ్యులు తలారి రమేష్, దేవి శంకర్, మాజీ సర్పంచి బక్కూరి గోపి, శ్రీనివాస్, రంజిత్, శేఖర్, క్రాంతి, తలారి, ప్రసాద్, అశోక్, శ్రీధర్, శేఖర్, లిఖిత, కళావతి, లక్ష్మీ, బాలమణి, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.


బుద్ధజయంతిలో పాల్గొన్న మాలసంఘం సభ్యులు

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- సమాజంలో జర్నలిస్టులకు గౌరవం తగ్గింది
- ప్రెస్ అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, దీన్ని ప్రతి ఒక్క జర్నలిస్ట్ గుర్తించాలని ప్రెస్ అకాడమి చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ ప్రజా కవి, రచయిత నందిని సిదా రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని ఒక ఫంక్షన్ హాల్‌లో టీయుడబ్ల్యుజే (ఐజేయు) ఆద్వర్యంలో "ప్రజాస్వామ్యం - మీడియా" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్టుల్లో పోరాట శీలత తగ్గడం వల్లే జర్నలిజానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పత్రికా స్వేచ్ఛలో ప్రపంచంలోనే భారతదేశం 159వ స్థానంలో ఉందని అన్నారు. జర్నలిస్టులకు సమాజంలో గౌరవం తగ్గిందనేది సత్యమని, సమాచార హక్కు ప్రజలకున్నా, ఈ రోజుల్లో ఆ హక్కును పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సత్యాన్ని రాసిన జర్నలిస్టు షోయబుల్లా ఖాన్ హత్యకు గురయ్యాడని అన్నారు. ప్రధాన పత్రికలు, పార్టీలకు మద్దతు తెలిపే యాజమాన్యాల చేతుల్లో ఉండడంవల్ల ప్రజాసమస్యలు బయటకురాని పరిస్థితి నెలకుందన్నారు. అందుకే సోషల్ మీడియా ఈ రోజు సక్సెస్ ఫుల్‌గా ముందుకు సాగుతుందన్నారు. ప్రశ్నించే బలమైన గొంతు అయిన జర్నలిజాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాచారం చేరవేయడంలో ఉండాల్సిన పారదర్శకత ఇప్పుడు లేదని, జర్నలిస్టులు హంసల పాత్ర వహించి పాలను, నీరును వేరు చేసినట్లు నిష్పక్షపాతంగా సమాచారం ప్రజలకు చేరవేయాలని అన్నారు. బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, విలువల కోసం ధీరోదాత్తతతో పోరాడాలని తెలిపారు. జర్నలిస్టులను గౌరవించాల్సింది అధికారులు, నేతలు కాదని, ప్రజలే ప్రజాస్వామ్య మనుగడలో జర్నలిస్టులది కీలకపాత్ర పోషించాలని అన్నారు. వార్తకు తటస్థం లేదని, తటస్థముంటే అది ప్యాకేజీ వార్తనే అవుతుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున పని చేస్తున్న మీడియాకు కూడా పారదర్శకత అవసరమేనని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలను కునేవారందరూ ఫిఫ్త్ పిల్లర్‌గా ఏర్పడి కలిసి పనిచేయాలని తెలిపారు. వృత్తి ప్రమాణాలు కాపాడుకోవడానికి జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శ్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఉర్దు అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర టియుడబ్ల్యుజే అధ్యక్షులు నగునూరి శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, టియుడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, జిల్లా కార్యదర్శి అరవింద్ బాలజీ, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతడకుల రమాకృష్ణ, కార్యదర్శి బైర శేఖర్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న టియుడబ్ల్యుజేయు సభ్యులు జర్నిలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

రైస్‌మిల్లర్లు 2, 3 అన్‌లోడింగ్ పాయింట్లను పెట్టుకొని ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, ఎట్టి పరిస్థితులలో 4-5 గంటలకు మించి లారీలు మిల్లులలో వెయిటింగ్‌లో ఉండరాదని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం మాచారెడ్డి, బీబీపేట్ మండలాలలోని పలు రైస్ మిల్లులను, ధాన్యపు కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు కేంద్రాలలో లారీలు వేచి ఉండడాన్ని గమనించి లోడింగ్ పాయింట్లను ఎక్కువ పెట్టుకొని త్వరగా వడ్లు దించుకొని తిరిగి లారీలను కేంద్రాలకు పంపించాలన్నారు. ప్రతి మిల్లు రోజు కనీసం 10 నుండి 15 లారీల ధాన్యాన్ని దించుకుంటేనే శనివారం నాటికి కొనుగోళ్లు పూర్తి చేయగలుగుతామన్నారు. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసి ఉంచిన సంచులను వెంటనే లోడింగ్ చేసి పంపాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

అదేవిధంగా తక్కువ ధాన్యం కుప్పలు ఉన్న కేంద్రాలలో వేగంగా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించి కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ముందుగా బీబీపేట్‌లోని ఇస్సానగర్ కొనుగోలు కేంద్రాన్ని, మాచారెడ్డి మండలంలోని లచ్చపేటలో గాయత్రీ రైస్‌మిల్, భవానిపేటలోని శైవి బాయిల్డ్ రైస్ మిల్, ఎల్.జి.ఆగ్రో రైస్ మిల్, భూలక్ష్మి అండ్ శ్రీ లక్ష్మి బాయిల్డ్ రైస్ మిల్లులను సందర్శించారు. ఈ కార్యక్రమాలలో పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.